క్లుప్తంగా

ఎంపీ చొరవతో తీరిన దాహార్తి సమస్య



బోరులో పుష్కలంగా వస్తున్న నీరు

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ నాయినివారిపల్లెలో ఇటీవల తాగు నీటి బోరు ఎండిపోవడంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. సమస్యను సర్పంచ్ అనితా కుమారి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. ఆదివారం రాత్రి కొత్త బోరు వేయించారు. పుష్కలంగా నీరు పడటంతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు చెప్పారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీనివాసులు

గంగవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సోమవారం వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే రక్త పరీక్షలు చేసి హిమోగ్లోబిన్ శాతం ఎంత ఉందో తెలియజేశారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించి, ఈసీజీ, రక్త పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సులభ కాన్పులు ప్రభుత్వాసుపత్రిలోనే సాధ్యమని, కాన్పు అయిన వెంటనే జనన ధ్రువీకరణ పత్రం అందజేయడమే కాకుండా రూ.1000 ప్రోత్సాహక నగదును తల్లి ఖాతాలో జమ చేస్తామన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయరూ!



పుంగనూరు బైపాస్ రోడ్డులో స్పీడ్‌బ్రేకర్లు లేని బండ్లపల్లె కూడలి

పుంగనూరు: పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో బండ్లపల్లె క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన కూడలి కావడంతో జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలు , సర్వీసు రోడ్లలో వచ్చే వాహనాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాల వేగానికి ప్రజలు హడలిపోతున్నారు. ఇకనైనా అధికారులు దీనిపై దృష్టి సారించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేసే దిశగా స్పీడ్‌బ్రేకర్లు వేయాలని కోరుతున్నారు.

త్రోబాల్ విజేత చంద్రమాకులపల్లె



చంద్రమాకులపల్లె విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, పీడీ మురళీధర్

పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లె జెడ్పీ హైస్కూల్ పుంగనూరు జోనల్స్ గేమ్స్ త్రోబాల్‌లో విజేతగా నిలిచింది. హెచ్‌ఎం శ్రీదేవి సోమవారం తెలిపిన మేరకు.. త్రోబాల్ పోటీలు సోమల మండలం కందూరులో నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు హెచ్‌ఎం, పీడీ మురళీధర్, ఉపాధ్యాయులు అభినందించారు

వెనుకబడిన కులాలను ఆదుకోరూ!

- కమిషనర్‌కు వినతి

పుంగనూరు: మున్సిపాలిటి పరిధిలోని దాసరి, జోగి, బాలసంత తదితర కులాలను గుర్తించి, వారికి విద్య, ఆరోగ్యం, జీవనోపాధి కల్పించాలని కమిషనర్ మధుసూదన్‌రెడ్డిని కోరారు. సోమవారం సంఘ ప్రతినిధులు మోహన్, ధనరాజ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న సీడ్ ప్రోగ్రాం ద్వారా మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కులాలు 20 వరకూ ఉన్నాయన్నారు. వాటిని గుర్తించి, ఆ కులాల కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

పంటల బీమా చేసుకోవాలి

రొంపిచెర్ల: పండ్ల తోటలకు ప్రభుత్వం కల్పించిన బీమా సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారిణి సంతోషి కుమారి కోరారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కొత్తగా మామిడి, టమాట తోటలకు బీమా సౌకర్యాన్ని కల్పించిందన్నారు. మామిడి పంటకు ఎకరాకు రైతులు రూ.1,750 ప్రీమియం, టమాట పంటకు రూ.1,250 చెల్లించాలన్నారు. ఒకవేళ ప్రకృతి వైపరీత్యాల మూలాన పంట నష్టపోతే మామిడికి ఎకరాకు రూ.35 వేలు, టమాటకు రూ.25 వేలు పరిహారంగా బీమా సంస్థ ఇస్తుందన్నారు. ఈనెల 15వ తేదీ లోపు పంటల బీమా చేసుకోవాలని కోరారు.

ఆదాయ సీతాఫలం

కుప్పం ప్రాంతంలో పనసగా పిలిచే సీతాఫలం జోరుగా సాగు చేస్తున్నారు. సాగు ఖర్చులు తక్కువ కావడం, ఏడాది రెండుసార్లు దిగుబడి వస్తుండడం..ఐదేళ్ల తరువాత ఎకరాకు సరాసరి రూ. 25 లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో కుప్పం రైతులు సీతాఫలం సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.





పెద్ద బంగారునత్తం వద్ద సాగు చేస్తున్న సీతాఫలం చెట్లు

- ఏటా రెండు పర్యాయాలు దిగుబడి
- ఐదేళ్ల తరువాత ఎకరాకు రూ.25 లక్షల ఆదాయం
- కుప్పంలో 50 ఎకరాల్లో సాగవుతున్న సీతాఫలం
- సాగు ఖర్చులు తక్కువ కావడంతో ఎక్కువ మంది మొగ్గు

కుప్పం రూరల్: మహారాష్ట్రలో విస్తృతంగా సాగవుతున్న సీతాఫలం చెట్లు కుప్పం బాట పట్టాయి. ఏటా రెండుసార్లు దిగుబడి వచ్చే ఈ సీతాఫలం ఒక్కసారి నాటితే 20 ఏళ్లకు పైగా దిగుబడినిస్తుంది. సాధారణ ఎరువులు తప్పితే ప్రత్యేకించి ఎరువులు వాడాల్సిన అవసరం లేదు. చీడపీడల బాధ అసలే లేదు. సమీపంలోనే బెంగళూరు, చెన్నై నగరాలు ఉండడంతో మార్కెటింగ్ సమస్య కూడా లేదు. ఏకంగా కేరళ వ్యాపారులే తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తుండడంతో క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. కుప్పం నియోజకవర్గంలో ప్రస్తుతం 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మరో 100 ఎకరాల్లో సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు.

మూడేళ్లకు దిగుబడి

సాధారణంగా సీతాఫలం సంవత్సరానికి ఒకసారి మాత్రమే దిగుబడి వస్తుంది. ప్రకృతి సిద్ధంగా అడవులు, పొలం గట్లపై వచ్చే సీతాఫలం ఇప్పటి వరకు చూసాం. కానీ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో సాగయ్యే సీతాఫలం సంవత్సరానికి రెండు మార్లు దిగుబడి వస్తుంది. అక్కడ రైతులు ఇతర పంటల తరహాలో బోరుబావుల వద్ద సీతాఫలం



సీతాఫలం చెట్లు

సాగు చేస్తున్నారు. ఈ రకం సీతాఫలాన్ని ప్రస్తుతం కుప్పంలో సాగు చేస్తున్నారు. అక్కడి నుంచి మొక్క రకాన్ని బట్టి రూ.50 నుంచి 100 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా పొలంలో 250 చెట్ల వరకు నాటుతారు. మూడేళ్లలో దిగుబడి వస్తుంది. పెద్దగా ఎరువులు అవసరం లేదు. సాధారణ తిప్ప ఎరువులు వాడుకుంటే చాలు. నీటి అవసరం కూడా తక్కువే. ఐదేళ్ల తరువాత ఒక్కో చెట్టుకు సీజన్‌కు 100 కిలోల వరకు దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి 120 వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఐదేళ్ల తరువాత ఎకరాకు 25 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం లేకపోలేదు. మొక్కల సంరక్షణపై ఒకింత శ్రద్ధ వహిస్తే చెట్లు 20 ఏళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో కుప్పం జనం ఏటా రెండు మార్లు సీతాఫలం రుచి చూసే అవకాశం సమీపంలోనే ఉంది.



అమ్మకానికి ఉంచిన కొల్హాపూర్ సీతాఫలాలు

ప్రతి రైతు 2 ఎకరాలు సాగు చేస్తే చాలు



ప్రతి రైతు రెండు ఎకరాల్లో కొల్హాపూర్ సీతాఫలం సాగు చేసుకుంటే చాలు ఐదేళ్లలో లక్షలాధికారులు కావడం ఖాయం. తక్కువ ఖర్చుతో ఎలాంటి రోగాలు లేకుండా సీతాఫలం సాగు చేయవచ్చు. ఒకసారి మొక్క నాటితే 20 ఏళ్లకు పైగా ఉంటుంది. దీంతో సాగు పెట్టుబడి అవసరమే లేదు. సంవత్సరంలో రెండుమార్లు దిగుబడి వస్తుంది. సరాసరిన ఐదేళ్ల తర్వాత ఎకరా పొలంలో రూ.25 లక్షలు ఆదాయం చూడటం సాధ్యమే. నేను నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నా. ఇప్పుడిప్పుడే దిగుబడి వస్తోంది. మరో సంవత్సరంలో పూర్తిస్థాయి దిగుబడి వస్తుంది.

– శ్రీరాములు, పెద్దబంగారునత్తం, సీతాఫలం రైతు

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు శ్రేయస్కరం



గర్భవతులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్

రొంపిచెర్ల: ప్రభుత్వాస్పతుల్లోనే గర్భవతులు కాన్పులు చేసుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరమని పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ అన్నారు. సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో గర్భవతులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పతులలో కాన్పులు చేసుకోవడం వలన తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని అన్నారు.బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టిస్తే, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భం ధరించిన మూడో నెల నుంచి ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రతి నెల 9న వైద్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ముడుపులపై నిగ్గు తేల్చాలి

పుంగనూరు: విద్యుత్ కొనుగోలులో ఆదాని ముడుపుల వ్యవహారంపై దర్యాప్తు చేసి వాస్తవాల నిగ్గు తేల్చాలని తేల్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జనార్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి, తహసీల్దార్ రాముకు వినతిపత్రం సమర్పించారు.

పేద ప్రజల ప్రాణాలు తీస్తున్న వడ్డీ వ్యాపారులు

- 60 ఫైనాన్స్ కంపెనీలపై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు: పేద ప్రజలపై వడ్డీ వ్యాపారుల దాడులతో అమాయకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పుంగనూరులో వడ్డీ వ్యాపారులు 60 మంది ఉన్నారని, వీరికి లైసెన్సు లేకుండా వీరంతా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. వడ్డీ వ్యాపార సంస్థలు, నిర్వాహకులపై సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశామన్నారు. ఆర్‌బీఐ అనుమతులు లేకుండా వంద రూపాయలకు రూ.20 చొప్పున వడ్డీ వసూలు చేస్తూ తమిళనాడు, ఆంధ్రాకు చెందిన వ్యాపారులు ప్రజలను దోచుకుంటున్నారని తెలిపారు. వ్యాపారులు రాసి ఇచ్చిన పాకెట్ పుస్తకాలను విలేకరులకు చూపించారు. వడ్డీ వ్యాపారులను ప్రశ్నిస్తే దాడులు చేయడం, అవమానాల పాల్జేస్తుండడంతో బాధితులు కుంగిపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వడ్డీ వ్యాపారుల ఆగడాలకు చెక్ పెట్టే దిశగా పోలీసులు కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో దళిత నాయకులు శ్రీనివాసులు, నాగరాజ, మంజు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్

ఆస్పత్రి బిల్లు కట్టలేని మహిళకు ఆర్థిక సాయం

పలమనేరు: మండలంలోని మొరం గ్రామానికి చెందిన సర్వీస్ టు ద సొసైటీ మిత్ర బృందం తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆస్పత్రి బిల్లు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్న రోగికి రూ.10వేల సాయాన్ని సోమవారం అందజేశారు. వీరు కొంత కాలంగా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ బిల్లు కట్టలేని పేదలకు సాయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెద్దపంజాణి మండలం దాసనపల్లెకు చెందిన నవీన్ భార్య నందిని తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలోఉంటూ సోషల్ మీడియా ద్వారా తన బాధను వ్యక్తం చేశాడు. దీన్ని గమనించిన నిర్వాహకులు ఇది వాస్తవమేనని ధ్రువీకరించుకున్నారు. రూ.10వేలను ఆస్పత్రి బిల్లు కోసం చెల్లించినట్టు నిర్వాహకులు అశోక్ ఆలమట్టి తెలిపారు.

లింగ నిర్ధారణ నేరం



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న మహతి ఫౌండేషన్ నిర్వాహకులు

బైరెడ్డిపల్లె: గర్భవతులు లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు అవగాహన కల్పించారు. అనంతరం మహతి ఫౌండేషన్ నిర్వాహకుల సౌజన్యంతో పౌష్టికాహారం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. క్రమం తప్పకుండా గర్భవతులు వైద్య పరీక్షలు చేయించుకోవడంతోపాటు ప్రభుత్వాసుపత్రుల్లోనే కాన్పులు చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, కాంతమ్మ, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల గృహాలకూ కరెంటు చార్జీలా..!?

- ఆర్డీఓ వద్ద సమస్యలు ప్రస్తావించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ
- నియోజవర్గంలో దళితవాడల సమస్యలపై దృష్టి సారిస్తామన్న ఆర్డీఓ

కుప్పం: గతంలో దళిత వాడల్లో విద్యుత్ చార్జీలపై ఒత్తిళ్లు లేవని, ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కాలనీ గృహాలకు కరెంటు చార్జీలు చెల్లించాలని వస్తున్న ప్రచారం తమకు ఆందోళన కలిగిస్తోందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ శ్రీనివాసరాజు తన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సెల్ సమావేశం నిర్వహించారు. నాలుగు మండలాల్లోని దళితవాడల్లో కనీస సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా ప్రభుత్వం ఇక నుంచి ఎస్సీ, ఎస్టీ గృహాల నుంచి కూడా కరెంటు చార్జీలు వసూలు చేస్తుందనే ప్రచారమవుతోందని, గతంలోలాగే పేద దళిత గృహాలకు మినహాయింపునివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇదలా ఉంచితే డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా అధ్వానంగా ఉందని ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని దళితవాడల సమస్యలపై సంబంధిత అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుని సమస్యల పరిష్కారానికి, దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయి లహరి తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

రామకుప్పం: ప్రజలు సైబర్ నేరాలపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని కుప్పం డీఎస్పీ పార్థసారథి అన్నారు. సైబర్ నేరాలపై సోమవారం మండలంలోని వీర్నమల, అరిమానుపెంట గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ, ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు గ్రామాల ప్రజలు అక్రమ వ్యాపారాల జోలికి వెళ్లరాదన్నారు. ప్రధానంగా గంజాయి సాగు, విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని హితవు పలికారు. లాటరీ వచ్చిందని, కారు గిఫ్ట్ ఇస్తామని.. ఇలా పలు రకాలైన మెసేజ్‌లు పంపి మొబైల్‌కు వచ్చే ఓటీపీలను ఎవరైనా అడిగితే చెప్పరాదన్నారు. ఇళ్లకు స్మార్ట్‌లాక్ పెట్టుకుంటే చోరీలకు అడ్డుకట్ట వేయడానికి వీలవుతుందన్నారు. అలాగే ఇళ్లు, దుకాణాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్న పక్షంలో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్,ఎస్ఐ వెంకట మోహన్, ప్రజలు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ పార్థసారథి

దుర్గసముద్రంలో రెవెన్యూ సదస్సు

–ఆర్డీఓ భవానికి 25 వినతులు

చౌడేపల్లె: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ఆర్డీఓ భవాని కోరారు. సోమవారం మండలంలోని దుర్గసముద్రంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 25 మంది రైతులు అర్జీలిచ్చారు సమస్యలను నిర్ణీత గడువు లోపు పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీఓ చెప్పారు. సదస్సులో తహసీల్దార్ హనుమంతు నాయక్, ఆర్‌ఐ భారతి, వీఆర్వోలు బాలాజీ, మల్లికార్జునరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, రవి, ఎండోమెంట్ అధికారి సురేంద్రరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

చెరుకువారిపల్లెలో రెవెన్యూ సదస్సు

సదుం: మండంలోని చెరుకువారిపల్లె సచివాలయంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నామని తహసీల్దార్ మారూఫ్ హుస్సేన్ తెలిపారు. భూసమస్యలపై వినతులు ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ భవాని

శివ.. శివా!



పలమనేరులోని శివాలయం


- శివుని ఆలయంలోనూ కూటమి మాటే చెల్లుబాటు
- నేడు నిర్వహించాల్సి మాన్యం భూముల బహిరంగ వేలం వాయిదా
- శివునితో ఆడుకుంటున్న ఎండోమెంట్..ఆడిస్తున్న నేతలు

సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చివరకు దేవుళ్లను, ఆలయ భూములనూ వదలడం లేదు. ఆలయ భూములకు సంబంధించిన మూడేళ్ల కౌలు విషయం సైతం అధికార పార్టీ చెప్పుచేతల్లోకి వెళ్లిపోయింది. శివుడు సైతం తమ మాట వినాల్సిందేననే లెవెల్లో ఇక్కడి నేతల పెత్తనానికి ఎండోమెంట్ అధికారులు సైతం జీ హుజూర్ అంటున్నారు. ఇదంతా చూసి ప్రజలు శివయ్యా..మూడో కన్ను తెరవయ్యా అంటున్నారు.

పలమనేరు: మూడేళ్లకోసారి స్వామి వారి మాన్యం భూములు ఎండోమెంట్ అధికారులు బహిరంగ వేలం వేసి వేసి ఎక్కువ పాట పాడిన వారికి కౌలుకు ఇవ్వడం ఇంతకాలమూ జరిగింది. ఈసారి సైతం ఆలయానికి సంబంధించిన గంగవరం మండలం సర్వే నంబర్లు 422/8లో 39 సెంట్లు, 452/4లో 82 సెంట్లు, 457లో 2.40 ఎకరాలు, 467లో 18 సెంట్లకు మంగళవారం స్థానిక శివాలయంలో మూడేళ్లపాటు కౌలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఈవో కమలాకర్ వారం రోజులుగా ప్రకటనలు చేశారు.

హఠాత్తుగా మళ్లీ వాయిదా

ఇందుకు సంబంధించి కూటమి నాయకుల ఆదేశాలతో పనిచేస్తున్న ఎండోమెంట్ అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఆదేశాలు వచ్చాయోగానీ హఠాత్తుగా వేలం పాట లేదంటూ ఈవో కమలాకర్ ఓ ప్రెస్‌నోట్‌ను పంపారు. దీని వెనుక పెద్ద మతలబు ఉన్నట్టు పట్టణంలో జోరుగా చర్చ సాగుతోంది. గతంలో కూడా శివుని పేరు చెప్పుకొని పబ్బం గడిచిన ఎందరో సర్వనాశనం అయ్యారని, అధికారం ఉందని ఆలయ చైర్మన్ గిరి దక్కించుకున్న ఓ పెద్దమనిషి ఆలయంలో పాదరక్షలతో నడవడంతో ఇప్పుడు ఆయన నడవలేని పరిస్థితి కలిగిందని జనంలో నానుతున్న మాట. ఏదేమైనా అధికార పార్టీ నేతలు, వారి అడుగులకు మడుగులొత్తుతున్న దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది కూడా ముక్కంటి ఆగ్రహానికి ఫలితం అనుభవించకతప్పదని పట్టణంలో జోరుగా వినిపిస్తోంది. ఈ విషయమై స్థానిక ఆలయ ఈఓ కమలాకర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.



శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానము

వేలం ప్రకటన

1	422/8	0.39		
2	452/4	0.82		
3	457	2.40		
4	467	0.18		

భూముల వేలం ఉంటుందని ప్రకటించిన నోటీసు



వేలం వాయిదా వేసినట్టు మీడియాకు పంపిన ఈఓ ప్రెస్‌నోట్

ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించాలి

- కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశం

కుప్పం: ప్రజా సమస్య పరిష్కార వేదికలో వస్తున్న ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం మండల సచివాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం నియోజకవర్గ స్థాయి అధికారులతో పీడీ సమీక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని, ఈ దిశగా ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ప్రతి గురువారం నియోజకవర్గంలోని ఓ గ్రామ పంచాయతీలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇటీవల కాలంలో రెవెన్యూ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిని శాఖాపరంగా సంబంధిత అధికారులు పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను అందుబాటులో ఉన్న ఆర్డీఓ, కడా పరిధిలోకి తీసుకొస్తే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్షలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

పార్కింగ్ స్థలం కాదు.. ఎంపీడీఓ కార్యాలయం!



మండల పరిషత్ కార్యాలయం ముందు పార్కింగ్ చేసిన వాహనాలు

పుంగనూరు: పట్టణ పీఎల్‌ఆర్ బైపాస్ రోడ్డులోని మండల పరిషత్ కార్యాలయం వాహనాల పార్కింగ్‌ను తలపిస్తోంది. నిత్యం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. కానీ పట్టణంలో ఎక్కడా లేని విధంగా అందరి వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేయడంతో అధికారులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయం పలువురికి పార్కింగ్ స్థలంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు దీనిని కట్టడి చేయాల్సి ఉంది.